విస్తారంగా వరి సాగు



విజయపురం మండలంలో వరిసాగు విస్తారంగా సాగు చేస్తున్నారు.సకాలంలో మంచి వర్షాలు కురవడంతో ఎక్కువ మంది రైతులు వరిసాగు వైపు దృష్టి సారించారు. మాధవరం, కళియంబాకం, పన్నూరు, బూచివానత్తం, జగన్నాథపురం, విజయపురం, కాళికాపురం, జీఎంపురం, కేవీపురం ప్రాంతాల్లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. కూలీలు అందుబాటులో లేకపోవడంతో ఎక్కువ మంది రైతులు వరి నాటకు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.

- విజయపురం, ఆంధ్రజ్యోతి

అలరించిన హరివిల్లు



రామకుప్పం మండలం బూరుగుమాకులపల్లెలో బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో చిరుజల్లులు కురిశాయి.కాసేపటికి ఇంద్రధనస్సు ఆవిష్కృతమైంది. కాసేపటికి సూర్యుడు ప్రకాశవంతం కావడంతో ఇంద్రధనుస్సు అదృశ్యమైంది.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి

పాలారుకు జలకళ



చాలాకాలం తరువాత పాలారు నదికి జలకళ వచ్చింది.కుప్పం నియోజకవర్గంలో 38 కిలోమీటర్లు ప్రవహించి తమిళనాడుకు చేరే ఈ నది పరివాహక ప్రాంతాల్లో నాలుగేళ్లుగా వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లోని పాలారు నదీ భూగర్భజలాలు అడుగంటిపోయాయి.పంటల సాగులో రైతులు ఇబ్బందులకు గురయ్యారు.ఈసారి కర్ణాటకలో భారీ వర్షాల కారణంగా రాష్ట్ర సరిహద్దులో వున్న చెరువులు నిండి మొరవలు పోతున్నాయి.గత శుక్రవారం ఆ వరద నీటితో సరిహద్దుల్లోని బేతమంగళం చెరువు నిండి మొరవ పారింది. ఆ ప్రవాహం బుక్కసాగరం, రామసముద్రం చెరువులకు చేరింది. ఆ రెండు చెరువులు నిండి మంగళవారం రాత్రి రామసముద్రం చెరువు మొరవ పారింది. ఆ ప్రవాహం గురువారం ఉదయం వి.కోట మండలం కొంగాటం వద్ద గల చెక్‌డ్యాంకు చేరింది. ఉదయం 11గంటలకు చెక్‌డ్యాం నిండి జలాలు కొళ్ళపల్లె వద్ద గల పాలారు నదిలోకి ప్రవేశించాయి.

- రామకుప్పం,ఆంధ్రజ్యోతి



ప్లాంటులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, సంస్థ ప్రతినిధులు



పీఎం మోదీ ప్రసంగం..

ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంటు ప్రారంభం



ఎర్రచెరువుపల్లెలో ఏర్పాటుచేసిన ఎల్‌పీజీ బాట్లింగ్ ప్లాంటు

పూతలపట్టు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి 60 వేల మెట్రిక్ టన్నుల బాట్లింగ్ సామర్థ్యాన్ని కలిగిన అత్యాధునిక ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంటు గురువారం పూతలపట్టు మండలంలోని ఎర్రచెరువుపల్లెలో ప్రారంభమైంది.కర్నూలు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో దీన్ని మంగళవారం మధ్యాహ్నం ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని ఎర్రచెరువుపల్లెలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా పలువురు వీక్షించారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్,ఇండియన్ ఆయిల్ తెలుగు రాష్ట్రాల ఈడీ పీయూష్ మిట్టల్ తదితరులు, ఎల్పీజీ పంపిణీదారులు, పూతలపట్టు మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, నాయకులు దేవాజి, చిరంజీవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల్లోని ఆరు జిల్లాలకు...

రాష్ట్రంలో పెరుగుతున్న లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ) వినియోగదారుల అవసరాలను తీర్చడానికి ఐఓసీఎల్ నాలుగేళ్ల కిందటే ప్లాంట్ పనుల్ని ఇక్కడ ప్రారంభించింది. రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఇటీవల పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కడప, వైజాగ్, కొండపల్లె (విజయవాడ) వద్ద మూడు ఇండేన్ ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్లు ఉండగా, ఇది నాలుగోది. ఇక్కడ రోజుకు 20 వేల సిలిండర్లు తయారుచేస్తారు. ఇది మన రాష్ట్రంలోని నాలుగు, తమిళనాడులోని రెండు, కర్ణాటకలోని ఓ జిల్లాలో విస్తరించి ఉన్న 80 మంది పంపిణీదారుల ద్వారా 7.2 లక్షలకుపైగా వినియోగదారులకు సేవలందించనుంది. ఈ ప్రాంతంలోని గృహాలు, హోటళ్లు, పరిశ్రమలకు ఎల్పీజీ సిలిండర్లను సకాలంలో సరఫరా చేయడంలో ఈ ప్లాంటు కీలకపాత్ర పోషించనుంది.

ఇక నాణ్యమైన సరఫరా: ఎంపీ

ఈ గ్యాస్ బాట్లింగ్ ప్లాంటు వల్ల రోజుకు 20 వేల సిలిండర్లు తయారవుతాయి. చెన్నై నుంచి గ్యాస్ తెచ్చి ఇక్కడ రీఫిల్లింగ్ చేసి ఏడు జిల్లాలకు సరఫరా చేస్తారు. రోజుకు 80 ట్రక్కులు ఆపరేట్ అవుతాయి. ఇక నుంచి షార్టేజ్ లేకుండా నాణ్యమైన సరఫరా అందుతుంది.

స్థానికులకు ఉపాధి : ఎమ్మెల్యే

పూతలపట్టు నియోజకవర్గంలో ఇలాంటి ప్లాంటును ఏర్పాటు చేయడం ద్వారా 125 మంది స్థానికులకు ఉపాధి లభించింది. పరోక్షంగా రవాణా, హోటల్స్ వంటి అనేక రంగాలు అభివృద్ధి చెందనున్నాయి. ప్రధాని మోదీ ఈ ప్లాంటును ప్రారంభించడం మా అదృష్టం.

పది మండలాల్లో తేలికపాటి వర్షం



చిత్తూరు నగరంలో మేఘావృతమైన ఆకాశం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా పది మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాల వారీగా.. బైరెడ్డిపల్లెలో 15.8, ఎస్ఆర్‌పురంలో 12.4, గుడిపాలలో 12.2, శాంతిపురంలో 10.2, సోమలలో 6.2, వి.కోటలో 2.4, రామకుప్పం, సదుంలో 2.2, పుంగనూరులో 2, గంగవరంలో 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సెలవురోజుల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలను జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి గురువారం తెలిపారు. సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేవారు రూ.5వేలను ప్రత్యేక రిజిస్ట్రేషన్ ఫీజుగా చెల్లించాలని, ముందుగానే ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకుని, అవసరమైన పత్రాలతో కార్యాలయానికి రావాలని కోరారు.

రేషన్ పంపిణీ 90.60 శాతం పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు ఈనెల ఒకటో తేదీనుంచి ప్రారంభమైన నిత్యావసర వస్తువుల పంపిణీ గురువారంతో ముగిసింది. 5,34,721 రేషన్ కార్డులకు ఎఫ్‌పీ డీలర్లు 4,84,502 కార్డులకు, పోర్టబిలిటీ ద్వారా 89,731 కార్డులకు రేషన్ పంపిణీ చేసి 90.60 శాతం వృద్ధి సాధించారు.

మేయర్ దంపతుల హత్యకేసు 24కు వాయిదా

చిత్తూరు లీగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దివంగత మేయర్ దంపతుల హత్య కేసు ఈనెల 24వ తేదీకి వాయిదా పడింది. 2016 నవంబరు 17న నగరపాలక కార్యాలయంలో కఠారి అనురాధ, మోహన్ దంపతులు హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు చింటూతోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసు గురువారం తొమ్మిదో అదనపు జిల్లా కోర్టులో వాయిదాకు రాగా, న్యాయమూర్తి శ్రీనివాసరావు ఈ కేసును ఈనెల 24వ తేదీకి వాయిదా వేశారు.

ఎన్ని సమావేశాల్లో చెప్పినా సమస్యలు పరిష్కరించరా?

- అధికారుల తీరుపై జడ్పీటీసీల ధ్వజం
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి రాకపోవడంపై ఆగ్రహం
- కోరం లేకుండానే మూడోస్థాయి సంఘ సమావేశం



వేదికపై జడ్పీ చైర్మన్,సీఈవో, వైస్‌చైర్మన్

చిత్తూరు రూరల్,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): ప్రతి సమావేశంలో తాము సమస్యలు చెప్తున్నా అవి పరిష్కారం కావడం లేదని అధికారుల తీరుపై జడ్పీటీసీ సభ్యులు అసహనాన్ని వ్యక్తం చేశారు.చిత్తూరు జడ్పీ సమావేశ మందిరంలో గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. సభ్యులు వారివారి మండలాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను నిలదీయడంతోనే సమావేశం ముగిసింది. కోరం లేకుండా మూడో స్థాయి సమావేశాన్ని నిర్వహించారనే విమర్శలు వచ్చాయి. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టడంపై కూడా సభ్యులు చర్చించారు. ఏదో ఒక సాకు చెప్పి జిల్లా స్థాయి అధికారులు సమావేశాలకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులును సభ్యులు కోరారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, జడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, 5వ స్థాయి సంఘ చైర్‌పర్సన్ భారతి తదితరులు పాల్గొన్నారు.

- గ్రామాల్లో విద్యుత్ అంతరాయం తీవ్రంగా ఉందంటూ ఎస్ఈ దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్లకోసం రైతులు నెలల తరబడి వేచివుండాల్సి వస్తోందనగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ హామీ ఇచ్చారు.
- కొత్త పింఛన్లు ఇవ్వకపోవడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు, బెడ్ రిడెన్, పెరాలసిస్ పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సదుం జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి డీఆర్‌డీఏ అధికారులను నిలదీశారు. ఉపాధి హామీ పనులకు బిల్లులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంద న్నారు.చిత్తూరు జిల్లాలో మార్చి 31వ తేది వరకు బిల్లులు అప్‌లోడ్ చేసే అవకాశం ఇస్తే తిరుపతి జిల్లాలో మాత్రం మార్చి 6వ తేదికే నిలిపివేశారని వాపోయారు.
- పీలేరులో యాభైకి పైగా ఆస్పత్రులుంటే కొత్తగా నిర్మించిన అశ్విని ఆస్పత్రిలోనే తనిఖీలు చేసి మూసివేశారంటూ వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై జడ్పీటీసీ రత్నశేఖర్ ధ్వజమెత్తారు.దీంతో వెంటనే ఆస్పత్రిని తెరిపించాలని అధికారులకు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు.
- ఆవులు, భూమి లేనోళ్లకు కూడా గోకులం షెడ్లు మంజూరు చేశారని ఎర్రావారిపాళ్యం జడ్పీటీసీ కరుణాకర రెడ్డి డ్వామా అధికారులను నిలదీశారు.
- పాలసముద్రం మండలంలో జగనన్న కాలనీ ఏర్పాటుకు ఖర్చు చేసిన డబ్బులు ఇంకా ఇవ్వకుండా హౌసింగ్ అధికారులు సతాయిస్తున్నారని జడ్పీటీసీ అన్బలగన్ వాపోయారు.
- వైద్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం కింద విడుదల చేసిన నోటిఫికేషన్‌కు అనుమతి వుందా అని గుడుపల్లె జడ్పీటీసీ కృష్ణమూర్తి అడగ్గా కలెక్టర్ అనుమతితోనే నోటిఫికేషన్ ఇచ్చామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెప్పారు.

'నీవానది'తో ఇబ్బంది లేకుండా శాశ్వత చర్యలు

- రూ.175 కోట్లతో వంతెనలు, రీటైనింగ్‌వాల్ ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి
- కలెక్టర్‌తో కలిసి వరద ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే జగన్మోహన్



వీరభద్రకాలనీ వద్ద కల్వర్టును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నీవానదికి వరదలు వచ్చినా.. పరివాహక ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి నీవానది పరివాహక ప్రాంతాలైన తోటపాళ్యం, ఏటివార, దోబీఘాట్, వీరభద్రకాలనీ, తేనబండ ప్రాంతాల్లో పర్యటించారు. సంతపేట లిల్లీబ్రిడ్జి వద్ద దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి.. స్థానికులతో మాట్లాడారు. నదికి అవతల ఉన్న కుటుంబాల కష్టాలను తెలుసుకున్నారు. సంతపేట విజయలక్ష్మి కాలనీనుంచి రోడ్డు సౌకర్యం కల్పించి.. వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యేలు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వీరభద్రకాలనీలో పర్యటించి దెబ్బతిన్న కల్వర్టును పరిశీలించారు. తేనబండ కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీటిలో నడుచుకుంటూ వెళ్లి చూశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వర్షాలు బాగా కురవడంతో దాదాపు చెరువులన్నీ నిండిపోయి, వాగులు పొంగుతున్నాయన్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తాయన్నారు. లిల్లీబ్రిడ్జి నిర్మాణానికి మరోసారి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నదీ పరివాహక ప్రాంతాల ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ఇదివరకే రూ.175కోట్లతో వంతెనలు, రీటైనింగ్‌వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, సీఎం వద్ద కూడా ఈ విషయంపై చర్చించానని చెప్పారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

నీవానది వరదలతో ఇబ్బందులుపడ్డ వీరభద్రకాలనీ ప్రజలకు ఎమ్మెల్యే జగన్మోహన్ నిత్యావసర వస్తువులతో కూడిన బ్యాగును అందించారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, వెంకటేష్ యాదవ్, పచ్చప్ప, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

1, 3, 4 తేదీల్లో 'కౌశల్' పోటీలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో వరలక్ష్మి తదితరులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కౌశల్ రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభా అన్వేషణ పోటీల్లో జిల్లా విద్యార్థులు రాణించాలని డీఈవో వరలక్ష్మి ఆకాంక్షించారు. గురువారం డీఈవో కార్యాలయంలోని తన చాంబర్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో నవంబరు 1,3,4 తేదీల్లో పోటీలు నిర్వహిస్తారన్నారు. జిల్లా స్థాయిలో 8,9 తరగతుల విద్యార్థులకు నవంబరు 27న, పదో తరగతి విద్యార్థులకు నవంబరు 28వ తేదీన పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపినవారికి డిసెంబరు 1-5 తేదీల్లో బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 27న తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో పోటీలు ఉంటాయన్నారు. ఏడీ వెంకటేశ్వరరావు, ఎంఈవోలు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కళ్యాణరేవుల జలపాతంలో యువకుడి గల్లంతు



గల్లంతైన యూనిస్

పలమనేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని కళ్యాణరేవుల జలపాతంలో యూనిస్ (25) అనే యువకుడు గల్లంతయ్యాడు. గురువారం స్నేహితులతో కలిసి జలపాతం వద్దకు వెళ్లిన యూనిస్ ప్రమాదవశాత్తు జలపాతంలో పడిపోయాడు. పలమనేరు అగ్నిమాపక సిబ్బంది జలపాతం వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే వర్షం ప్రారంభం కావడంతో పాటు చీకటి పడుతుండటంతో గాలింపు చర్యలు ముందుకు సాగలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు కౌండిన్యనది ఉధృతంగా ప్రవహిస్తోంది. నది ప్రవాహం కళ్యాణరేవుల జలపాతం మీదుగా తమిళనాడులోని మోర్ధాన ప్రాజెక్టుకు చేరుతుంది. నదీ ప్రవాహం ఉధృతంగా ఉన్నందున మృతదేహం మోర్ధాన ప్రాజెక్టుకు చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.



‘కే-ర్యాంప్’ పద్ధతైన సినిమా

తిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ‘కే-ర్యాంప్’ చాలా పద్ధతైన సినిమా అని, ఫ్యామిలీతో కలిసి చూడవచ్చని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఆ చిత్ర దర్శకుడు జైన్స్ నానితో కలిసి గురువారం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అక్టోబరు 18న సినిమా విడుదల కానున్న నేపథ్యంలో స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చామన్నారు. కాగా ‘చెన్నై లవ్ స్టోరీ’ అనే చిత్రంతో పాటు మరో రెండు ప్రాజెక్టులు కూడా చేస్తున్నట్టు వెల్లడించారు.

కిరణ్ అబ్బవరం, జైన్స్ నాని

శ్రీవారి సేవలో ప్రముఖులు





గుమ్మనూరు జయరాం - శంకర్ గౌడ్, కిరణ్‌రాయల్

తిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, హైదరాబాద్ హిమాయత్‌నగర్ టీటీడీ ఎల్‌ఏసీ చైర్మన్ శంకర్ గౌడ్, తిరుపతి జనసేన ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ ఉన్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించండి

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించాలని దక్షిణ మధ్యరైల్వే గుంతకల్లు డివిజన్ అదనపు డివిజన్ మేనేజరు యు.సుధాకర్ ఆదేశించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ ఆధునికీకరణ పనులు జరుగుతున్న సమయంలో ప్రయాణికులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకొని వసతులు పెంచాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. డీఈఈ వీరయ్య, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, ఎస్ఎస్ఈలు సిద్దారెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.79 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,919

తలనీలాలు సమర్పించినవారు: 28,218



యువతే మన దేశ సంపద





విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న సినీ నటుడు కిరణ్ అబ్బవరం

ఎస్వీయూ ఏడీ భవనం ముందు కళా ప్రదర్శనగా వస్తున్న విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్వీయూ వీసీ నరసింగరావు

- ‘యువతరంగ్’ ప్రారంభోత్సవంలో ఎస్వీయూ వీసీ
- ఆకట్టుకున్న ర్యాలీ, కళా ప్రదర్శనలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువతే మన దేశానికి నిజమైన సంపద అని ఎస్వీ యూనివర్సిటీ వీసీ టి.నరసింగరావు పేర్కొన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే ‘యువతరంగ్-2025’ గురువారం ప్రారంభమైంది. శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ సభలో వీసీ మాట్లాడారు. కళలు మనిషిని మానవీయంగా మారుస్తాయని అభిప్రాయపడ్డారు. తనకు వ్యక్తిగతంగా కళలు, సంగీతం పట్ల ఆసక్తి ఉన్నా, సాధన చేయడం సాధ్యం కాలేదని తెలిపారు. ప్రస్తుతం వీలైన మేరకు సంగీతాన్ని సాధన చేస్తున్నట్లు చెప్పారు. యువత ఏదో ఒక కళలో ప్రావీణ్యం సంపాదించాలని రిజిస్ట్రార్ భూపతి నాయుడు సూచించారు. యూనివర్సిటీ విద్యార్థులను అద్భుతమైన క్రీడాకారులుగా, కళాకారులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు సూచించారు. యూనివర్సిటీ పరిధిలో కళలకు సంబంధించిన ప్రత్యేక కోర్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్ ప్రొఫెసర్ చెంగ్రాయుడు, ఆర్ట్స్, కామర్స్, ఇంజనీరింగ్ ప్రిన్సిపాళ్ళు సుధారాణి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో- ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ రంజిత్ కుమార్, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్, ప్రసన్న, స్వరూప్, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ ప్రాంతాల కళాకారులు పాల్గొన్నారు. అంతకుముందు అన్నమయ్య భవన్ నుంచి శ్రీనివాసా ఆడిటోరియం దాకా కళాబృందాలు, విద్యార్థులు ర్యాలీగా వెళ్లారు.





ప్రత్యేక ఆకర్షణగా కిరణ్ అబ్బవరం

యువతరంగ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు కిరణ్ అబ్బవరం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో తానెంతో ఉత్తేజం పొందానని చెప్పారు. తనకు వచ్చిన గుర్తింపునకు యువత ముఖ్య కారణమన్నారు. తనకు పాతికేళ్ల వయసులో జీవిత లక్ష్యం అర్థమైందని, సినిమా రంగంలో కళాకారుడిగా రాణిస్తాననే నమ్మకం పెరిగిందని గుర్తుచేసుకున్నారు.

రసవత్తరంగా పోటీలు

గురువారం మధ్యాహ్నం నుంచి మూడు సమాంతర వేదికలపై చేపట్టిన సాంస్కృతిక పోటీలు రసవత్తరంగా సాగాయి. సుమారు 30 అంశాలపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, కళా బృందాలు ప్రదర్శనలు ఇచ్చారు. విజేతలకు ముగింపు సభలో బహుమతులు ప్రదానం చేయనున్నారు.



వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భార్యకు నిప్పంటించిన భర్త

చంద్రగిరి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తు. ఆపై గొడవ. దీంతో భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు వెంకటేష్. ఈ ఘటన చంద్రగిరి మండలం తొండవాడ పంచాయతీ పరిధిలోని ఉగ్రప్రత్యంగిరాదేవి ఆలయం సమీపంలోని నిమ్మతోటలో మంగళవారం రాత్రి జరిగింది. వెంకటేష్, హరిత దంపతులది సదుం మండలం. తొండవాడ సమీపంలోని వెంకటకృష్ణ నిమ్మతోటకు ఎనిమిదేళ్లుగా కాపలాదారులుగా ఉంటున్నారు. మంగళవారం రాత్రి భార్యభర్తలు మద్యం తాగారు. ఆపై వారి మధ్య గొడవ జరగడంతో అక్కడే ఉన్న పెట్రోల్‌ను భార్యపై పోసి నిప్పటించాడు. ఆమె కేకలు వేస్తుండగా, వెంకటేష్ రోడ్డుపైకి వచ్చి జరిగిన విషయాన్ని స్థానికులు చెప్పాడు. ఆమెను 108 వాహనంలో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబరు 18నుంచి యంగ్ బర్డర్ శిబిరం

ఏర్పేడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పక్షులు,పర్యావరణంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ఐసర్, షోలా స్కై ఐలాండ్స్ సంయుక్తంగా ఓ శిబిరం నిర్వహించనున్నాయి. యంగ్ బర్డర్ పేరిట డిసెంబరు 18 నుంచి 22 వరకు ఐసర్ ప్రాంగణంలో శిబిరం నిర్వహించనున్నారు. 14 నుంచి 18 ఏళ్ల ఔత్సాహిక విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చునని ఐసర్ అధికారులు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నవంబరు 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 20 మందిని ఎంపిక చేయనున్నారు. పర్యావరణం,పక్షుల పట్ల ఆసక్తి, ప్రకృతిపై అనురక్తి పెంపొందించేందుకు ఈ శిబిరం దోహదపడుతుందన్నారు. దరఖాస్తుతో పాటు మర్ని వివరాలకు స్కైలాండ్.ఇన్./వైబీసీ25.హెచ్‌టీఎంఎల్‌ను చూడాలని సూచించారు.

తిరుపతి- సికింద్రాబాద్ మధ్య నేడు, రేపు ప్రత్యేక ఏసీ రైళ్లు

తిరుపతి(సెంట్రల్), అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని శుక్ర, శనివారాల్లో తిరుపతి- సికింద్రాబాద్ మధ్య ఏసీ ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైలు (09497) తిరుపతిలో శుక్రవారం బయలుదేరి గూడూరు, తెనాలి, నడికుడి, నల్లగొండ మీదుగా మరుసటి రోజు సికింద్రాబాదుకు చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలు (09498) సికింద్రాబాదులో బయలుదేరి బేగంపేట, వికారాబాదు, రాయచూర్, ఆదోని, గుంతకల్లు, కడప, మీదుగా తిరుపతికి మరుసటి రోజు చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైలుకు పూర్తిగా 3 ఏసీ పెట్టెలు ఉంటాయి.



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్



నమో..జోష్

‘సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్’ పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

\- కర్నూలు (ఆంధ్రజ్యోతి)



సభలో ఉప్పొంగిన దేశభక్తి




సభలో టీడీపీ మహిళా నేతలు





శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



పొలాల వెంబడి పరుగులు

పారిశ్రామికంగా చిల్లకూరు అభివృద్ధి

- సుమారు రూ.4500 కోట్లతో పనులు
- రెండేళ్లలో అభివృద్ధి పనులు పూర్తి



సాగర్‌మాల రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చిల్లకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం త్వరలోనే పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని తద్వారా ఎంతో మందికి ఉపాధి కలుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం మండలంలో జరుగుతున్న సాగరమాల, క్రిస్‌సిటీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారులను కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తూ సుమారు రూ. 3వేల కోట్లతో సాగరమాల రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వరగలి క్రాస్‌రోడ్డు నుంచి 35 కిలోమీటర్లు, నాయుడుపేట నుంచి 36 కిలోమీటర్లు, ముత్తుకూరు నుంచి 19 కిలోమీటర్లు వరకు సాగరమాల రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. సాగరమాల రోడ్డు నిర్మాణ పనుల్లో భూసమస్యలు, మైనింగ్, ఇరిగేషన్ వంటి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. నాయుడుపేట నుంచి కృష్ణపట్నంపోర్టు సౌత్‌గేట్ వరకు నిర్మిస్తున్న సాగరమాల రోడ్డు పనులను 2027 జూన్ కల్లా పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ రోడ్లు కృష్ణపట్నపోర్టుకు అనుసంధానం చేయడం ద్వారా మండలంలో ఎక్కువశాతం పరిశ్రమలు రానున్నాయన్నారు. అదేవిధంగా తమ్మనపట్నంలో 2500 ఎకరాల్లో క్రిస్‌సిటీ పారిశ్రామకవాడను ఏర్పాటు చేయనున్నామన్నారు. క్రిస్‌సిటీలో 1200 కోట్లు రూపాయల పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రూ.200 కోట్లు అభివృద్ధిపనులు జరుగుతున్నాయ న్నారు. వచ్చే ఏడాది డిసెంబరు కల్లా క్రిస్‌సిటీలో రూ.1200 కోట్లు అభివృద్ధిపనులు పూర్తవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఆర్డీవో భానుప్రకాశ్‌రెడ్డి, తహసీల్దారు శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని సర్వేయర్ దుర్మరణం



సర్వేయర్ సునీత (ఫైల్‌ఫొటో)

నాగలాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని మండల సర్వేయర్ మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... మండల సర్వేయర్ సునీత (35), సురుటుపల్లి సచివాలయ సర్వేయర్ దినేష్‌లు గురువారం సాయంత్రం సురుటుపల్లిలో ఓ స్థలాన్ని సర్వే చేశారు. అనంతరం దినేష్ ద్విచక్రవాహనంపై ఈమె నాగలాపురానికి బయలుదేరారు. బయటకొడియంబేడు వద్ద వెనుక వస్తున్న ఒక టిప్పర్ లారీ అధిగమించే క్రమంలో వీరి ద్విచక్ర వాహన స్టీరింగ్‌ను తాకింది. దీంతో ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దినేష్, సునీతలు చెరోవైపు పడిపోయారు. లారీ చక్రం ఈమె తల భాగం మీదుగా వెళ్లడంతో సునీత సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచింది. దినేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆమె మృతదేహాన్ని సత్యవేడు వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడిని నాగలాపురం పీహెచ్‌సీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త వెంకటేశులు టీటీడీలో ఏఈగా పనిచేస్తున్నారు. వీరికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వృద్ధుడికి డెంగ్యూ

రేణిగుంట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ సీఆర్‌నగర్ కాలనీలో ఈశ్వరయ్య అనే వృద్ధుడు డెంగ్యూ భారినపడ్డాడు. పంచాయతీ సిబ్బంది ఆ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపట్టారు. బ్లీచింగ్ చల్లి, నీటి ట్యాంకులను శుద్ధి చేశారు.

సూపర్ జీఎస్టీ 2.0 తగ్గింపును సద్వినియోగం చేసుకోండి



జీఎస్టీపై అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న జేటీసీ కృష్ణవేణి, టీడీపీ మురళీమోహన్ తదితరులు

- జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణి

తిరుపతి(రవాణా), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ 2.0తగ్గింపు ద్వారా కలిగే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని రవాణాశాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (జేటీసీ) కృష్ణవేణి పిలుపునిచ్చారు. దీనిపై రవాణాశాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో చేపట్టిన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలో వాహనాల కొనుగోలుపై జీఎస్టీ రేటు తగ్గింపుతో ప్రజలకు కలిగే ఆదాపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. కొనుగోలుదారులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేలా తిరుపతి రవాణాశాఖ కార్యాలయంలో వాహన డీలర్లతో స్టాళ్లను ఏర్పాటు చేశామని జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ చెప్పారు. ఆటోమొబైల్ రంగంలో నూతనంగా వచ్చిన వాహనాలను ప్రజలకు చూశారు. జీఎస్టీపై ఫిర్యాదు చేయదలుచుకుంటే టోల్‌ఫ్రీ నెంబరు 1915కు సమాచారం ఇవ్వాలని జీఎస్టీ అధికారులు రాజ్యలక్ష్మి, నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మోహన్‌కుమార్, రమణనాయక్, ఆంజనేయ ప్రసాద్, స్వర్ణలత, పరిపాలన అధికారులు, విజయప్రశాంతి, విజయ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రవాణాశాఖ కార్యాలయంలో వాహనాల స్టాల్స్‌ను ఏర్పాటుచేసిన దృశ్యం

రెండే శ్లాబులు.. అన్ని వర్గాలకు లాభాలు

రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ





జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ తదితరులు - ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

చిత్తూరు సిటీ,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ స్లాబులను రెండుకు తగ్గించడం వల్ల అన్నివర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ అన్నారు. జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న జిల్లా రవాణా శాఖ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు వాహన ర్యాలీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తగ్గిన జీఎస్టీ లాభాలను ప్రజలకు తెలియజేయడానికి విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రభుత్వ శాఖలద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే ట్రాక్టర్ నడపగా.. డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఎంవీఐలు రాజేశ్వరరావు, నరసింహులు, దీపిక, వాహన డీలర్లు పాల్గొన్నారు.

మాపై కనికరం చూపండి

● పీహెచ్‌సీ వైద్యుల వినతి



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీ వైద్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల ఆరోగ్య రక్షకులుగా ఉన్న తమపై ప్రభుత్వం కనికరం చూపాలని పీహెచ్‌సీ వైద్యులు విన్నవించారు. సమస్యల పరిష్కరించాలని కోరుతూ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నా గురువారంతో 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. తమ సమస్యలపై ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. 24 ఏళ్లగా విధులు నిర్వహిస్తుంటే ప్రమోషన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు ధర్నా చేస్తూనే ఉంటామని తెలిపారు. వివిధ పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువలో తేలిన మృతదేహం



శ్రీకాంత్ మృతదేహం

పుంగనూరు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం బోడేవారిపల్లె పంచాయతీ యాతాలవంక సమీపంలోని హంద్రీ-నీవా కాలువలో మదనపల్లె వాసి మృతదేహం తేలింది. గురువారం మృతదేహం కుళ్లి దుర్వాసన రావడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పుంగనూరు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని కుళ్లిన మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించారు. 15 రోజుల క్రితం హంద్రీ-నీవా కాలువలో పడినట్లు గుర్తించి అన్నమయ్య జిల్లా మదనపల్లె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మదనపల్లె వన్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లెలో భరత్ మెడికల్ షాపు దుకాణ యజమాని శ్రీకాంత్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ శ్రీకాంత్ 15 రోజుల క్రితం తాను చనిపోతున్నట్లు అమెరికా, బెంగళూరులో ఉన్న కుమారులకు ఫోన్ మెసేజ్ పెట్టి ద్విచక్రవాహనంలో మదనపల్లెకి కొంతదూరంలోని హంద్రీ-కాలువ పక్కన వాహనంతో పాటు తన వస్తువులు పెట్టినట్లు మదనపల్లె పోలీసులు తెలిపారు. దీంతో మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు శ్రీకాంత్ అదృశ్యమైనట్లు కేసు నమోదు చేయగా.. శవం లభ్యం కావడంతో మృతదేహాన్ని మదనపల్లె పోలీసులకు అప్పగించినట్లు పుంగనూరు సీఐ తెలిపారు.

హ్యాండ్ బాల్ పోటీలకు సోమల విద్యార్థి ఎంపిక



విద్యార్థి భరత్ సాయి

సోమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు సోమల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి భరత్ సాయి ఎంపికైనట్లు హెచ్ఎం హేమసుధాకర్ తెలిపారు. 15న సీటీఎం ఉన్నత పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరిగాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈనెలలో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో భారత్ సాయి పాల్గొంటారని పీడీ కరుణానిధి తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

వెంకటరమణస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4.71 లక్షలు



శ్రీవారి ఆలయంలో హుండీ లెక్కిస్తున్న టీటీడీ సిబ్బంది

పుంగనూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన టీటీడీ ఆధీనంలోని కల్యాణ వెంకటరమణ స్వామి మూడు నెలల ఆలయ హుండీ లెక్కింపుతో రూ.4,71,410 ఆదాయం చేకూరినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక ఆలయంలో తిరుపతి గోవిందరాజుస్వామి ఆలయ అనుబంధ ఆలయాల డిప్యూటీ ఈవో నాగేంద్రప్రసాద్, విజిలెన్స్ గార్డు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. హుండీ ఆదాయాన్ని ఇండియన్ బ్యాంకులో టీటీడీ అకౌంట్‌లో జమచేసినట్లు తెలిపారు.

జిల్లా వాలీబాల్ జట్టుకు మేకలచిన్నేపల్లె విద్యార్థిని



భావన

చౌడేపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాలీబాల్ జట్టుకు మేకలచిన్నేపల్లె హైస్కూల్ విద్యార్థిని భావన ఎంపికైనట్లు హెచ్ఎం చంద్రశేఖర్ పేర్కొన్నారు. పలమనేరులో జరిగిన డివిజన్ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన భావన ఎంపిక కావడంతో పీఈటీ నాగమునికృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. శుక్రవారం అంగళ్లులో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

రామకుప్పం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం విజలాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో గురువారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, చేతుల శుభ్రత తదితర అంశాలపై వైద్యసిబ్బంది వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఏఎన్ఎం శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శబరిమల యాత్రకు ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కేరళలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమల యాత్రకు ప్రత్యేక ప్యాకేజీ టూర్(హైర్ టూర్ బస్సులు)ను ప్రవేశపెట్టినట్లు ఏపీ పర్యాటకాభివృద్ధి డీవీఎం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 36 సీట్ల నాన్ ఏసీ హైటెక్, 45సీట్ల ఏసీ ఓల్వో బస్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 08772289123, 9848007033, 9848802099, 9848973985లను సంప్రదించాలని కోరారు.

ఓవరాల్ చాంపియన్‌గా శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల జట్టు



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అంతర్ కళాశాల ల క్రీడా పోటీలలో శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల జట్టు ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. బాస్కెట్‌బాల్, ఖోఖో, టేబుల్‌టెన్నిస్, టెన్నికాయిట్ పోటీలలో విజయం సాధించగా బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్ పోటీలలో రన్నరప్‌గా నిలిచింది. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణమ్మ క్రీడాకారులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ క్రీడలతో పోటీ తత్వం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ భారతి మాట్లాడుతూ గెలుపోటములను సమభావనతో చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగాధిపతి భద్రమణి, భువనేశ్వరిదేవి, పద్మశ్రీ పాల్గొన్నారు.

కారు షెడ్డులో దొంగలు పడ్డారు

పలమనేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు-కుప్పం మార్గంలోని కొలమాసన పల్లె వద్ద బుధవారం అర్ధరాత్రి విజయ్ అనే వ్యక్తికి చెందిన కారు షెడ్డులో దొంగలు పడ్డారు. గురువారం ఉదయం గ్యారేజి వద్దకు రాగానే దొంగలు పడినట్లు గుర్తించారు. విలువైన ఇంజన్ సామాన్లు, కారు ఇంజన్లకు వినియోగించే ఆయిల్, విలువైన స్పేర్ పార్ట్స్ చోరీ చేసుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

నేరం ఒప్పుకో?

● ఆ ఇద్దరు టీడీపీ నేతలు చేయించారని చెప్పు

● 'అంబేడ్కర్' ఘటనపై పోలీసులు కొట్టి..

బెదిరించారన్న అరుణ్



చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి వచ్చిన అరుణ్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరు టీడీపీ నేతల ప్రోద్బలంతో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టానని చెప్పాలంటూ పోలీసులు కొట్టారని బాధితుడు అరుణ్ ఆరోపించారు. గురువారం తిరుపతి రుయాస్పత్రిలో ఆయన చికిత్స పొందారు. వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనకు సంబంధించి వైసీపీకి చెందిన బొమ్మయ్యపల్లె సర్పంచి గోవిందయ్యను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో వైసీపీ నాయకులు కాకుండా టీడీపీ వారే చేయించారని పోలీసులు బెదిరించారంటూ దేవళంపేటవాసి అరుణ్ చెబుతున్నారు. 'ఈనెల 13వ తేదీ పోలీసులు వచ్చి నన్ను ఎస్ఐ పిలుస్తున్నారంటూ ఆటోలో ఎక్కించుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. టీడీపీ నేతలు సతీష్ నాయుడు, కిషన్‌చందు మందు పోయించి అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టించారని చెప్పాలన్నారు. వాళ్లు చెప్పడంతో మరో ఇద్దరితో కలిసి చెరువు మార్గంలో వచ్చి నిప్పు పెట్టి వెళ్లినట్లు ఒప్పుకోవాలని కొట్టారు. మద్యం తాగించి బలవంతంగా చెప్పించడానికి ప్రయత్నించారు. స్టేషన్‌లో కాళ్లకు గొలుసులువేసి బంధించి చిత్రహింసలు పెట్టారు. బోర్లా పడుకోబెట్టి వీపుపై, చేతులు, కాళ్లపై కొట్టారు. పోలీసుల లాఠీచార్జి దెబ్బలకు శరీరమంతా కమిలిపోయింది' అంటూ కొందరు మీడియా ప్రతినిధుల వద్ద దేవళంపేటకు చెందిన అరుణ్ ఆవేదన వ్యక్తంచేశారు.గురువారం మధ్యాహ్నం 11.51 గంటలకు చికిత్స నిమిత్తం ఆయన తిరుపతి రుయాస్పత్రిలోని అత్యవసర విభాగంలో చేరారు. పోలీసులు కొట్టడంతో గాయాలైనట్లు డాక్టర్లకు చెప్పారు. ఇతడిని పరీక్షించిన వైద్యులు శరీరంపై దెబ్బలు బలంగా ఉన్నాయని, నోరు, ముక్కు నుంచి నెత్తురు కారుతోందని ధ్రువీకరించారు. మెడికో లీగల్ కేసు కింద ఆస్పత్రిలో రిజిస్టర్ చేసి వెదురుకుప్పం పోలీసులకు సమాచారం అందించారు. కాగా, మధ్యాహ్నం తర్వాత ఆస్పత్రి నుంచి ఆయన స్వచ్ఛందంగా డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లారు.

ఎందుకా అత్యుత్సాహం?

అంబేడ్కర్ విగ్రహ ఘటన కేసును కార్వేటినగరం సీఐ దర్యాప్తు చేస్తున్నారు.కర్నూలులో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సీఐ, ఎస్ఐ, కొందరు సిబ్బంది వెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరు పోలీసులు 13వ తేది అరుణ్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చి కొట్టారని, బుధవారం వదిలిపెట్టినట్లు బాధితుడి మాటలను బట్టి తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసులో.. అధికార టీడీపీ నేతలను ఇరికించేలా, వారి పేర్లు చెప్పాలంటూ ఆ పార్టీ కార్యకర్తను ఇలా హింసించడం వెనుక వీరి అత్యుత్సాహం ఏమిటి? అధికారులు లేనప్పుడు ఇంత ధైర్యంగా ఈ పని చేశారంటే.. వాళ్లకంత దన్ను ఇచ్చిన వాళ్లెవరు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రతి కుటుంబానికీ తగ్గిన జీఎస్టీతో లబ్ధి

ఎమ్మెల్యే మురళీమోహన్



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికీ తగ్గిన జీఎస్టీతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే మురళీ మోహన్ తెలిపారు. గురువారం పూతలపట్టులో రవాణాశాఖ ఆధ్వర్యంలో మోటారు వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీపావళి కానుకగా ప్రకటించిన జీఎస్టీ రేట్లతో ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు. అనంతరం పూతలపట్టు అంబేడ్కర్ సర్కిల్ నుంచి కాణిపాకం ఆర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, ఎంపీపీ కుమారి, నేతలు గుంటూరు మురళి, చిరంజీవి, ఏకాంబరం, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

గూగుల్ రాకతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గూగుల్ రాకతో మన రాష్ట్రానికి కోట్లాది రూపాయల ఆదాయంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. గురువారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుపై గూగుల్ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడం శుభపరిణామన్నారు. కూటమి ప్రభుత్వం చొరవతో విశాఖలో ఏర్పడుతున్న ఏఐ సిటీకి దాదాపు 10 బిలియన్ల పెట్టుబడి పెడుతున్నారని పేర్కొన్నారు. ఆసియాలో గూగుల్ చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టులలో ఒకటిగా విశాఖ సెంటర్ నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వ అంచనా ప్రకారం 2028-2032 లో సగటున సంవత్సరానికి రూ. 10,518 కోట్ల జీఎస్‌డీపీ వాటాతో పాటు సుమారు 1,88220 ఉద్యోగాలను సృష్టించనుందని వివరించారు. గూగుల్ క్లౌడ్ ఆధారిత ఉత్పత్తులతో సంవత్సరానికి రూ.9553 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షల షెడ్యూల్ విడుదల

తిరుపతి(విద్య), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టైప్ రైటింగ్, షార్ట్‌హ్యాండ్ - 2026 పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి గురువారం ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 4న షార్ట్‌హ్యాండ్ పరీక్ష జరుగనుంది. 24, 25 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. హాజరుకాగోరు విద్యార్థులు తమ సమీపంలోని టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించి, పరీక్ష రుసుం చెల్లించాలని సూచించింది. ఇతర వివరాలకు రాష్ట్ర సాంకేతిక విద్యామండలి అధికార వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ఒంటరి ఏనుగు బీభత్సం



పాతపేట వద్ద సిమెంటు దిమ్మెను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు

కల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట వద్ద బుధవారం రాత్రి ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి బుధవారం రాత్రి బయలుదేరిన ఒంటరి ఏనుగు పాతపాళ్యం అటవీ మార్గంలో పాతపేట వద్దకు చేరుకుంది. పాతపేట రోడ్డుకు ఇరువైపులా ఉపాధి పథకంలో నాటిన రాగి చెట్లను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. అక్కడి నుంచి సదుం-కల్లూరు రోడ్డు వద్దకు చేరుకున్న ఒంటరి ఏనుగు రోడ్డు పక్కనున్న సిమెంటు దిమ్మెను ధ్వంసం చేసింది. సదుం-కల్లూరు రోడ్డును దాటుకున్న ఒంటరి ఏనుగు ఇటీవల చెరువుకట్టపై నుంచి జారి పడి ఏనుగు మృతి చెందిన ప్రాంతానికి చేరుకొని రైతు గుర్రప్పకు చెందిన వరిపంటను ధ్వంసం చేసింది. అక్కడి నుంచి ఒంటరి ఏనుగు బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీ ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకొని అక్కడి రైతులు గోపి, ఆంజనేయులుకు చెందిన వరి పంటను ధ్వంసం చేసింది. సమీపంలో ఉన్న పశుగ్రాసాన్ని తినేసింది. అక్కడి నుంచి వచ్చిన దారిలోనే అడవిలోకి తిరుగుముఖం పట్టింది. మార్గంలోని పలువురు రైతుల పంటలను ధ్వంసం చేసుకుంటూ పశ్చిమ విభాగం అడవిలోకి చేరుకుంది. గురువారం పగలంతా అడవిలోని గోగులమ్మ వంక వద్ద ఒంటరి ఏనుగు సంచరించినట్లు ప్రజలు తెలిపారు.

కలెక్టర్‌తో హైరోడ్డు బిల్డర్స్ సంఘం భేటీ



కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలతో చిత్తూరు బిల్డింగ్ యజమానులు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రకాశం హైరోడ్డు విస్తరణ అంశాలపై బిల్డింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ వెంకటేష్ నాయుడు, సెక్రటరీ మనోహర్‌లు గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో సుదీర్ఘంగా చర్చించారు. వీరితో పాటు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఉన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించి పలువురు భవన యజమానులు తమ సమస్యలు, పరిష్కార మార్గాలను తెలియజేశారు. భవనాలు కోల్పోయే యజమానులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వడం, హైరోడ్డులో వంద మీటర్ల స్థానే 80 మీటర్ల వరకు విస్తరణ అంశాలను తెలియజేశారు. మున్సిపల్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. అంతకుముందు చిత్తూరు ఎంపీ, ఎమ్మెల్యే- కలెక్టర్‌తో ఆయన చాంబర్‌లో భేటీ అయ్యారు. నగర అభివృద్ధి, రహదారుల విస్తరణ, భూ యజమానుల సమస్యల పరిష్కారం-పరిహారం చెల్లింపు, రహదారుల అభివృద్ధి పనుల వేగవంతం, నీవా నది వరదల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

స్లీపర్ బస్సుల్లో భద్రత ఎంత?

రాజస్థాన్ ఘటనతో అధికారులు మేల్కోవాలి ● ప్రమాణాలు, నిబంధనలపై దృష్టి పెట్టాలి



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్లీపర్ ఏసీ బస్సుల్లో భద్రత ఎంత? రవాణా శాఖ ప్రామాణికాలు, నిబంధనలు ఎంత వరకు పాటిస్తున్నారు? అసలు విద్యుత్ కనెక్షన్లు, వైర్లు ఎంతవరకు సేఫ్టీగా ఉన్నాయి? రాజస్థాన్ ఉదంతంతో తలెత్తుతున్న ప్రశ్నలివి. మంగళవారం రాజస్థాన్‌లో ఏసీ స్లీపర్ బస్సులో మంటలు వ్యాపించడంతో కనీసం 20 మంది మరణించారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని భావిస్తున్నారు. దీంతో మన బస్సుల భద్రతపైనా అధికారులు మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఇటు బస్సుల నిర్వాహకులు, అటు అధికారులపై ఉంది. కొన్ని బస్సుల్లో ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ ఎలా పనిచేస్తోందనే విషయాన్ని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అంతకుమించి వీటిపై ప్రయాణికులకూ అవగాహన లేకపోవడం వారికి కలిసివస్తోంది. తిరుపతి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో ఇక్కడ నుంచి విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, కాకినాడ, హైదరాబాదు, చెన్నై వంటి నగరాలకు రోజుకు 15 నుంచి 20 ఏసీ స్లీపర్ ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. ఇక బెంగళూరు నుంచి తిరుపతి మీదుగా వెళ్ళే బస్సులు దాదాపు 30 వరకు ఉన్నాయి.

ఇలా చేయాలి..

● స్లీపర్ ఏసీ బస్సుల్లో రెండు డోర్లు ఉండాలి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే ప్రయాణికులు బయటకు వచ్చేలా ఎగ్జిట్ డోర్ సిస్టమ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

● ప్రతి ఐదు సీట్లకు ఒక సుత్తిని ఉంచాలి. లేకుంటే సైడ్ అద్దాలు పగులకొట్టడం అసాధ్యమని అధికారులు చెబుతున్నారు.

● బస్సుల్లో వైర్లు, ఏసీ, ఇంజన్ సామర్థ్యం పరిశీలించుకోవాలి. ఆరు నెలలకోసారి ఎలక్ట్రికల్, ఏసీ మెకానిక్, అగ్నిమాపక శాఖ సిబ్బంది ద్వారా తనిఖీలు చేయించుకోవాలి. ఏవైనా లోటుపాట్లుంటే సరిదిద్దాల్సిన బాధ్యత ట్రాన్స్‌పోర్టు యాజమానులపై ఉంది. బస్సుల్లో పాత వైర్లుంటే మార్చాలి.

● బస్సుల్లో అంతర్గత కండిషన్ వ్యవస్థపై నిఘా ఉంచాలి.

అప్రమత్తత.. అందరి బాధ్యత

ఏసీ స్లీపర్ బస్సు డ్రైవర్లు గంటకు 120 నుంచి 140 కిలోమీటర్ల వేగంలో వెళ్తుంటే.. ప్రయాణికులు అడ్డు చెప్పాలి. ప్రతి బస్సుకు ఎడమ, కుడి వైపుల్లో కనీసం రెండు ఎమర్జెన్సీ డోర్లుంటే అనుకోని ప్రమాదం జరిగితే దిగిపోవడానికి అవకాశాలుంటాయి. హాల్టింగ్ పాయింట్ల వద్ద ఎలక్ట్రిక్ మెకానిక్‌లు బస్సులను తనిఖీలు చేసి షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫైర్ ఫైటింగ్ వ్యవస్థపై ప్రయాణికులకూ అవగాహన కల్పించాల్సిన బాధ్యత డ్రైవర్లకు ఉండాలి. మేమూ వారానికోసారి తనిఖీలు చేసి అవగాహన కల్పిస్తున్నాం.

- మురళీమోహన్, డీటీవో, తిరుపతి

సూపర్ జీఎస్టీతో పేదలకు ప్రయోజనం

కుప్పం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీతో పేదలకు ప్రయోజనం చేకూరిందని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 10వ క్లస్టరులో గురువారం ఆయన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు.



జీఎస్టీపై కరపత్రాలు పంచుతున్న పీఎస్ఎం తదితరులు

తగ్గిన జీఎస్టీతో నిత్యావసర సరుకులు సహా చాలా వస్తువుల ధరలు తగ్గిన వివరాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కౌన్సిలర్లు సోము, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, మంజునాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రొంపిచెర్ల తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్

రొంపిచెర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల తహసీల్దార్‌గా కిరణ్‌కుమార్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలోని తహసీల్దారు అమరనాథ్ చిత్తూరు కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

ఏనుగుల దాడులపై చర్యలు తీసుకోవాలి

ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు

సోమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏనుగుల బెడద నివారణకు అటవీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు కోరారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ ఈశ్వర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ప్రభాకర్ మాట్లాడుతూ సోమల మండల కేంద్రంలోని పలువీధుల్లో డ్రైనేజీ కాలువలు దుస్థితికి చేరుకుని అధ్వానంగా మారాయని.. వర్షపునీరు రోడ్డుపై ప్రవహిస్తున్నాయని వాపోయారు. నంజంపేట ఎంపీటీసీ జిన్నా మాట్లాడుతూ జీడిరేవులవంకపై శాశ్వత వంతెన నిర్మించాలని కోరారు. ఇరికిపెంట ఎంపీటీసీ హరినాథ్ మాట్లాడుతూ గన్నావారిపల్లె, నీలావారిపల్లె, వడ్డిపల్లెలకు శ్మశాన వాటికలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి మాట్లాడుతూ కొందరు రైతులు వ్యవసాయ పొలాల వద్ద రాత్రి వేళల్లో అడవి పందుల నివారణకు విద్యుత్ తీగలు తీయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని తెలిపారు. ఎంపీడీవో ప్రసాద్, మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు

ఘనంగా ఆయుధ పూజ

పలమనేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విజయదశమి సందర్భంగా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి గురువారం తన సతీమణి రేణుకారెడ్డితో కలిసి స్వగృహం లో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. తనవాహనాలతో పాటు, తుపాకులకు పూజలు చేశారు. అంతకు ముందు టీడీపీ కార్యాలయంలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత ఎన్టీరామారావు, తన తండ్రి దివంగత నూతనకాల్వ రామకృష్ణారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బంది, డ్రైవర్లకు దసరా కానులను అందించారు. కార్యక్రమాల్లో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సతీమణి రేణుకారెడ్డితో కలిసి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి







వైసీపీ పాలనలోనే కల్తీ మద్యం: చల్లా



పుంగనూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కల్తీమద్యం వల్ల రాష్ట్రంలో ఎంతోమంది ప్రాణాలు పొట్టనపెట్టుకున్న చరిత్ర వారికే దక్కుతుందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం జీఎస్టీ తగ్గింపుపై పుంగనూరులో జరిగిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని జీఎస్టీ 2.0తో తగ్గిన వస్తువుల వివరాలు ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్‌లో చల్లా మాట్లాడుతూ భారతదేశంలోనే అతి పెద్ద గూగుల్ కంపెనీని వైజాగ్ తీసుకురావడం మన అదృష్టమని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.శమిపతి, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ రాము, ఎంపీఐ సుప్రియ, మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ పగడాల రమణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు విరాళాల వెల్లువ

సోమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు పలువురు దాతలు విరాళం అందజేసినట్లు కమిటీ అధ్యక్ష, కోశాధికారులు ఎన్.మునివెంకటప్ప, జ్యోతీశ్వరుడు తెలిపారు. గురువారం సోమలకు చెందిన మునివెంకటప్ప, ఆయన కుమారులు రూ.1,00, 116, సూరయ్యగారిపల్లె ఉపాధ్యాయుడు ప్రసాద్ రూ.51 వేలు, వెంకటసాయికుమార్, వెంకటరత్నం రూ.50 వేలు, సింగంశెట్టి కుటుంబ సభ్యులు రూ.30 వేలు, ఎంఈవో శివరత్న రూ.15 వేలు, గట్టువారిపల్లెకు చెందిన వెంకట్రామయ్య రూ.15 వేలు, సుధాకర్ రూ.10,116, హేమంత్ రూ.10,116, సూరయ్యగారిపల్లె శివ రూ.10,116, సరస్వతీపురానికి చెందిన జగదీశ్ రూ.10 వేలు, టీచర్ సూర్యప్రకాశ్ రూ.10,116, పీఎస్. రాజా రూ.10,116, విశాంత్ర హెచ్ఎం దాసరి రత్నయ్య రూ. 10, 116 విరాళంగా అందజేసినట్లు తెలిపారు.





టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబాలు



వైసీపీ కుటుంబాలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్

రామకుప్పం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంద్యాలమడుగు పంచాయతీ ఎస్.గొల్లపల్లె, కావలిమడుగు గ్రామాల్లోని వైసీపీకి చెందిన పలు కుటుంబాల నుంచి గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రెండు గ్రామాలకు చెందిన టైలర్ రామ్మూర్తి, శంకర్, రత్నమ్మ, మురుగేష్‌లతోపాటు వారి కుటుంబ సభ్యులకు రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, పరశురాం, సంపత్, ఉమేష్, ఆనందకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ



పలమనేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని బీసీ, ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహాలను గురువారం మెప్మా పీడీ రవీంద్ర తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని వంటశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, ఆరోగ్యవంతమైన ఆహారాన్ని అందించాలని వసతిగృహ అధికారులకు సూచించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని.. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





మార్కెట్ యార్డును వినియోగంలోకి తెస్తాం



రామకుప్పం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మినీ మార్కెట్ యార్డును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెస్తానని కుప్పం ఏఎంసీ చైర్మన్ జీఎం రాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక నేతలతో కలిసి మార్కెట్ యార్డును సందర్శించారు. నాయకులు మునస్వామి, వెంకట్రామగౌడు, వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి, ఆనందరెడ్డి, రఘు, మునీంద్రనాయక్, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.







చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వినాయక సదన్‌ను పరిశీలించిన ఈవో



గదిలోని ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యార్థం కాణిపాక క్షేత్రంలో వినాయక సదన్‌ను గురువారం వరసిద్ధుడి ఆలయ ఈవో పెంచలకిషోర్ పరిశీలించారు. ప్రధానంగా ఇక్కడ నూతనంగా నిర్మించిన 3,4 అంతస్తుల్లోని గదులను, ఏర్పాటుచేసిన ఫర్నిచర్‌ను తనిఖీ చేశారు. క్వాలిటీ బాగుందని ప్రశంసించారు. నూతనంగా నిర్మించిన గదులతో కలిపితే ఇక్కడ మొత్తం 200 గదులు అవుతాయన్నారు. దీనివల్ల బస చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈలు అరవింద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

పాలసముద్రం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వనదుర్గాపురం పంచాయతీ దిగువ వనదుర్గాపురం, మిట్టఇండ్లు గ్రామాల్లో గురువారం రెండు బోర్లను ఎమ్మెల్యే థామస్ వేయించినట్లు ఎంపీడీవో సతీష్ గురువారం తెలిపారు. ఈనెల ఒకటో తేదీన ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా తాగునీటి సమస్య గురించి ఎమ్మెల్యేకి ప్రజలు తెలియజేయడంతో ఆయన సూచనల మేరకు జడ్పీ నిధుల నుంచి రెండు బోర్లు మంజూరు చేసి వేశారు. రెండు బోర్లలో సమృద్ధిగా నీళ్లు రావడంతో ఎమ్మెల్యేకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్ల విస్తరణ పనుల పరిశీలన



లిల్లీ బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, మేయర్, తదితరులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న రోడ్ల విస్తరణ పనులను పలువురు ప్రజా ప్రతినిధులతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గురువారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నగరంలో గాంధీ రోడ్డు, హైరోడ్డు పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్ల విస్తరణకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ నరసింహ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి అదృశ్యంపై కేసు నమోదైంది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపినవివరాల మేరకు.. కట్టమంచికి చెందిన మోహిత్(30) పనికివెళ్లకుండా ఇంట్లోనే ఉండేవారు. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే తిరగబడేవాడు. బుధవారం కూడా గొడవ జరగడంతో ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దాంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువు వద్ద గ్రామస్తుల పూజలు

బంగారుపాళ్యం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని చెరువులు మొరవ సాగుతున్నాయి. మంగళపల్లె పంచాయతీ 65 వెంకటాపురం కొత్తచెరువు మొరవ సాగడంతో సర్పంచు కుప్పాల మురళి ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం చెరువు వద్ద పూజలు చేశారు. అలాగే ముంగరమడుగు సమీపంలోని వెంకటప్పనాయిని చెరువు, మొగిలిలోని గౌనివాని చెరువు, గౌరీశంకరాపురం చెరువు, బలిజపల్లె చెరువు, గుంతూరు చెరువు, శెట్టేరిలోని తురకవాని చెరువు, దత్తువంక చెరువులు నిండుకుండలా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇరుకురోడ్డు.. ఆపై గుంతలు



హైరోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అసలే ఇరుకురోడ్డు.. ఆపై గుంతలు.. తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు. చిత్తూరులో రోజూ అధికారులు, ప్రజాప్రతినిధులు తిరిగే హైరోడ్డులోని పాతబస్టాండు సమీపంలోని రోడ్డు దుస్థితి ఇది. రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఉండటంతోపాటు అంచులు కోసుకుపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

పాఠశాలల్లో తనిఖీలు

తవణంపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తొడతర జిల్లా పరిషత్, మోడల్ ప్రైమరీ ప్రాథమిక పాఠశాలలను జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఇందిర గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఎంఈవోలు హేమలత, మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు డెస్కుల వితరణ



పాలసముద్రం, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): తిరుమలరాజుపురం జడ్పీ హైస్కూల్‌కు బెంగళూరుకు చెందిన కె.బాబురాజు, పి.మోహన్‌రాజు సహకారంతో 25 డెస్కులను వితరణ చేశారని హెచ్‌ఎం మురళీకృష్ణమరాజు తెలిపారు. వీటిని గ్రామానికి చెందిన గంగరాజుద్వారా అందించారని హెచ్‌ఎం చెప్పారు.

కందగిరి ఆలయ వైస్ చైర్మన్ మృతి

గుడిపాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కందగిరి ఆలయ వైస్ చైర్మన్ సుందర వరదయ్య బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన కుప్పిగానిపల్లె సర్పంచ్‌గా పనిచేశారు. ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, సభ్యులతోపాటు సర్పంచ్ మధుసూదన్‌రాయల్, ఎంపీటీసీ విజయలక్ష్మి తదితరులు గురువారం నివాళి అర్పించారు.

గంగుపల్లెలో పశువైద్య శిబిరం

పెనుమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గంగుపల్లెలో గురువారం రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్‌మిషన్ ఆధ్వర్యంలో గర్భకోశ వ్యాధుల చికిత్స కార్యక్రమం నిర్వహించారు. పుత్తూరు ఉపసంచాలకుడు గోవిందయ్య, పూతలపట్టు సహాయ సంచాలకుడు విజయమోహన్, పెనుమూరు వైద్యాధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కారును ఢీకొని టమోటాల వ్యాను బోల్తా

● ఒకరికి గాయాలు



రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన టమోటాలు

విజయపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): టమోటాల లోడుతో వెళుతున్న వ్యాను అదుపుతప్పి కారును ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలమేరకు.. ఎస్ఎస్‌కండ్రిగ నుంచి ఇళ్లత్తూరు మీదుగా ఆర్కాడుకుప్పం వైపు టమోటాల లోడుతో గురువారం ఓ వ్యాను వెళుతోంది. అదే సమయంలో తిరుత్తణి నుంచి కారొకటి పాతార్కాడు వైపు వస్తోంది. పాతార్కాడు సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారును అదుపుతప్పి టమోటాల వ్యాను ఢీకొని బోల్తాపడింది. కారు ముందు భాగం ధ్వంసమై అందులోని ప్రత్యూష్(42)కు గాయాలయ్యాయి. ఇతను మాజీ మంత్రిరోజాకు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశారు. వ్యాను డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్‌బాబు తెలిపారు.

భానుప్రకాష్‌కు సన్మానం



నగరి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): దేశమ్మ దేవాలయ పాలకమండలి చైర్మన్ కడుంబూరు రత్నవేలు, సభ్యులు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను గురువారం సాయంత్రం కలసి సన్మానించారు. తమకు అవకాశం కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధికార ప్రతినిధి జ్యోతి నాయుడు, శీనురాజు, కేఆర్ వడివేలు, న్యాయవాది సోమశేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టపాకాయలు పేల్చడం పర్యావరణానికి హానికరం

బంగారుపాళ్యం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): టపాకాయలు పేల్చడం పర్యావరణానికి హానికరమంటూ ఆర్కే మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం జాతీయ రహదారిపై కరస్పాండెంట్ కోమల రవీంద్ర ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. నాలుగురోడ్ల కూడలి వద్ద మానహారం నిర్వహించారు. పాఠశాల యజమాని సావిత్రమ్మ, స్కూల్ ఇన్‌చార్జి భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో 'జీఎస్టీ'పై అవగాహన



సమావేశంలో ప్రసంగిస్తున్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరులో 'సూపర్‌జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జీఎస్టీ స్పెషల్ ఆఫీసర్ సుమతి, ఎంపీఐలు కుసుమ, మురళి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ర్యాలీ, సమావేశం నిర్వహించారు. నాయకులు శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్,దేవసుందరం, అరుల్‌నాథన్,కామసాని కోదండరెడ్డి, నియాజ్ అలీ, అశోక్‌నాయుడు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్లలో తనిఖీలు

నగరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ, మండల పరిధిలోని బాణసంచా గోడౌన్లను నగరి సీఐ విక్రమ్, తహసీల్దార్ రవికుమార్ గురువారం తనిఖీ చేశారు. వ్యాపారులకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరి సీఐ విక్రమ్, తహసీల్దార్ రవికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంగుపల్లె చెరువులో వ్యర్థాల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో వ్యర్థాలను తొలగిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెనుమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గంగుపల్లె చెరువులోని వ్యర్థాలను అధికారులు తొలగించారు. 'చెరువులో కలుస్తున్న వ్యర్థాలతో ఇబ్బందులు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఎంపీడీవో నీలకంఠేశ్వర్ రెడ్డి సూచనతో సెక్రటరీలు జన్మశ్రీ, రూపవతిలు చెరువును శుభ్రం చేశారు. పరిసర ప్రాంతాల్లోని చికెన్ సెంటర్లకు, ఇతర వ్యాపారులకు చెరువులో చెత్త వేయరాదని, వేసినవారిపై చర్యలు తీసుకుంటామని నోటీసులు ఇచ్చారు. అలాగే చెరువు ప్రాంతంలో మూడు చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

పాల మిత్రలకు మిక్సీల పంపిణీ



నగరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎం.కొత్తూరులోని శ్రీజ పాల ఉత్పత్తి కేంద్ర పరిధిలో ఉన్న 22 మంది పాల మిత్రలకు గురువారం దీపావళి కానుకగా మిక్సీలను పంపిణీ చేశారు. శ్రీజ మహిళా మిల్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వీటిని అందజేసినట్లు కంపెనీ ఏరియా మేనేజర్ జ్యోతీశ్వర రెడ్డి తెలిపారు. సూపర్‌వైజర్ కార్తీక్, లోకేష్, రఘు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన 'సీతమ్స్' విద్యార్థులు



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సీతమ్స్ కళాశాల విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు చైర్మన్ కలాల రంగనాథం, శ్రీనివాస ట్రస్టీ డీఏ కల్పజ, కార్యదర్శి బద్రీనారాయణ తెలిపారు. టీసీఎస్, సీఆర్ఎం, టాట్ ఎఫ్‌డీ, ట్యాప్ మొదలైన కంపెనీల్లో కళాశాలకు చెందిన ఎంసీఏ, ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్న 256 మంది విద్యార్థులు రూ.3 లక్షల నుంచి రూ.20లక్షల వరకు వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి: బీజేపీ

శ్రీరంగరాజపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని గంగాధర నెల్లూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రాజేంద్రన్ అన్నారు. గురువారం ఉడమలకుడితి గ్రామానికి చెందిన తెలుగు రైతు మాజీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ వర్మను రాజేంద్రన్ మర్యాదపూర్వకంగా కలిసి బీజేపీలోకి ఆహ్వానించారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జ్యోతిరెడ్డి, నాయకులు వాసు, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీప్రసన్నకు కేంద్రమంత్రి అభినందనలు



లక్ష్మీ ప్రసన్న

యాదమరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మాధవరం సర్పంచ్ జె.కె.రవి కుమార్తె లక్ష్మీప్రసన్న.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను హంపిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న తాను ఇన్ఫోసిస్‌లో చేస్తున్న ప్రధాన్ మంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ (పీఎంఐఎస్) అనుభవాలను మంత్రితో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను మంత్రి అభినందించారు.

మామిడి రైతులకు 'సబ్సిడీ' విడుదలపై హర్షం

గుడిపాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు టన్నుకు నాలుగు వేల చొప్పున సబ్సిడీ నిధులను విడుదల చేయడం హర్షణీయమని తెలుగు రైతు మండల కార్యదర్శి రెడ్డెప్ప, మాజీ టీడీపీ ప్రధానకార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. ఎమ్మెల్యే జగన్మోహన్‌కు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ముద్దికుప్పంలో వైసీపీ రచ్చబండ

శ్రీరంగరాజపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ముద్దికుప్పం గ్రామంలో కోటి సంతకాల సేకరణలో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని జీడీనెల్లూరు వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి గురువారం నిర్వహించారు. నాయకులు గురవారెడ్డి, సిద్దయ్య, శ్యామ్‌రాజ్, హరిప్రసాద్‌రెడ్డి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

క్షూరికాపురంలో జీఎస్టీపై ప్రచారం

విజయపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్షూరికాపురంలో టీడీపీ నేతలు సూపర్ జీఎస్టీపై గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, నేతలు మునిభాస్కర్ రాజు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

యాదమరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌వో శ్రీనివాసమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్యులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.